క్లుప్తంగా

నేడు జగన్నాథ రథయాత్ర

జగిత్యాలటౌన్ : ఇస్కాన్ మెట్‌పల్లి ఆలయ కేంద్రం, జగిత్యాల ఇస్కాన్ ప్రచార కేంద్రం ఆధ్వర్యంలో శనివారం జగిత్యాలలో జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని శుభమస్తు ఫంక్షన్‌హాల్ నుంచి కొత్త బస్టాండ్ మీదుగా రథయాత్ర కొనసాగుతుందన్నారు. హరినామ సంకీర్తనలతో సాగే జగన్నాథ రథయాత్రలో హిందూ బంధువులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఇస్కాన్ ప్రచార కేంద్ర ప్రతినిధులు డా నరహరిదాస్. జరుపుల శ్రీనివాస్ కోరారు.

కరపత్రాల పంపిణీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలే చేపట్టిందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో ఇంటింటా తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్ర పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందాయన్నారు. కరోనా సమయంలో ప్రజలకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. ఆయనవెంట నాయకులు సాయి, పొత్తూరి నరేశ్, కుమ్మరి శివ, గణేశ్ తదితరులున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్సై ప్రేమ్‌దీప్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని హరిదాస్ నగర్‌కు చెందిన తాళ్లపల్లి రవి గతనెలలో సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ ద్వారా గుర్తించగా శుక్రవారం బాధితుడికి ఎస్సై ప్రేమ్‌దీప్ ఫోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

గుడుంబా తయారీదారుల బైండోవర్



గుడుంబా విక్రేతను చూపుతున్న పోలీసులు

కోనరావుపేట: గ్రామాల్లో గుడుంబా విక్రయిస్తే చర్యలు తప్పవని చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని గోవిందరావుపేట తండా (బావుసాయిపేట)లో శుక్రవారం పోలీసుల తనిఖీలు నిర్వహించారు. అజ్మీరా కిషన్, అజ్మీరా సంతోష్ వద్ద గుడుంబా తయారీకి వినియోగించే బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. ఇద్దరిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో గుడుంబా తయారీని మానుకొని ప్రత్యామ్నాయం చూసుకోవాలన్నారు. ఎస్సైలు రమాకాంత్, ప్రభాకర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సన్నరకంపై రైతన్న ఆసక్తి

- మార్కెట్లో సన్నరకం ధాన్యానికి డిమాండ్
- ప్రతీ వానాకాలంలో లక్ష ఎకరాల్లో వరిసాగు
- అధిక దిగుబడునిచ్చే విత్తనాలపై శాస్త్రవేత్తల అవగాహన



జగిత్యాల మసూరి సన్నవరి రకం

జగిత్యాల అగ్రికల్చర్ : జిల్లాలో ప్రతి వానాకాలం సీజన్‌లో సన్నరకం వరిని దాదాపు లక్ష ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. సన్నరకం బియ్యానికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. అయితే ఏ రకం విత్తనం అధిక దిగుబడినిస్తుంది.. ఏ మేరకు పురుగులు, తెగుళ్లను తట్టుకుంటాయో రైతులకు తెలియడం లేదు. దీంతో ప్రైవేట్ కంపెనీల విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రైతులు సాగు చేయాల్సిన సన్నరకాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

తెలంగాణ సోనా (ఆర్‌ఎన్ఆర్ 15048)

ఈ రకం 2015లో విడుదలైంది. పంటకాలం 125 రోజులు ఉండగా నూక శాతం తక్కువగా ఉంటుంది. అగ్గి తెగులును తట్టుకుంటుంది. జూలై మొదటి వారం వరకు నారు పోసుకొని నెల చివరివరకు నాటు వేసుకోవచ్చు. ఎకరాకు 28 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మార్కెట్లో సన్న రకానికి మంచి డిమాండ్ ఉంది. ఈ రకం మధుమేహం ఉన్నవారు కూడా తినవచ్చు.

బీపీటీ – 5204 (సాంబ మసూరి)

ఈ రకం పంట కాలపరిమితి 150 రోజులు. సన్న గింజ రకం. అయితే, ఈ రకం పొట్టిగా ఉండి నేల మీద పడే అవకాశం ఉంటుంది. పెద్దగా చీడపీడలను తట్టుకునే శక్తి లేదు. ఈ రకం నారును జూన్ చివరి వరకు పోసుకోవచ్చు. ఎకరానికి 28 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. మార్కెట్లో మంచి రేటు ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల నుంచి విడుదలైంది.

జగిత్యాల సన్నాలు (జేజీఎల్–1798)

గింజ సాంబ మసూరిని పోలి ఉంటుంది. 125 రోజుల్లో కోతకు వస్తుంది. పంట ఎత్తు 95–100 సెంమీ ఉండి పడిపోదు. ఉల్లికోడును సమర్థవంతంగా, అగ్గి తెగులును కొంత వరకు తట్టుకుంటుంది. ఎకరానికి 25–30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. ఈ రకం 2002లో పొలాస పరిశోధనా స్థానం నుంచి విడుదలైంది.

జగిత్యాల మసూరి (జేజీఎల్ –11470)

అధిక దిగుబడినిచ్చే సన్నగింజ రకం. వానాకాలంలో 135 రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరానికి 28–32 క్వింటాళ్ల వరకు దిగుబడి రానుంది. పంటఎత్తు 90–100 సెంమీ. ఈదురుగాలులకు పడిపోదు. ఉల్లికోడును, అగ్గితెగులును తట్టుకుంటుంది. జూన్‌లో విత్తితే 10–20 రోజుల్లో పెరుగుతుంది. ఈ రకం విత్తనం 2010లో పొలాస నుంచి విడుదలైంది.

హెచ్ఎంటీ సోనా

ఈ రకం పంట 135 రోజులు. గింజ సన్నగా ఉంటుంది. బియ్యం నాణ్యత బాగుంటుంది. మహారాష్ట్ర నుంచి ఈ రకం విత్తనం విడుదలైంది. చీడపీడలను తట్టుకునే శక్తి తక్కువ. ఎకరాకు 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.

కూనారం రైస్–1 (కేఎన్ఎం–733)

ఇది స్వల్పకాలిక రకం. 120 రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరాకు 30–32 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. సన్న గింజ రకం. అగ్గి తెగులు, చలిని కొంతవరకు తట్టుకుంటుంది. ఇది 2019లో పెద్దపల్లి జిల్లా కూనారం పరిశోధన స్థానం నుంచి విడుదలైంది.

కూనారం వరి–2 (కేఎన్ఎం–1638)

సాంబ మసూరికి దీటుగా ఈ విత్తనాన్ని 2021లో కూనారం పరిశోధన స్థానం నుంచి విడుదల చేశారు. 120–125 రోజుల వరకు పంటకాలం. కొంతవరకు ఉల్లికోడు, అగ్గి తెగులును తట్టుకుంటుంది. ఎకరాకు 28–32 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కంకి పూర్తిగా బయటకు వచ్చి గింజ రాలదు, రుచిగా ఉంటుంది.

ప్రాణహిత (జేజీఎల్–11727)

ఎకరాకు 28–34 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. గింజ సన్నగా పొడవుగా ఉంటుంది. మధ్యకాలిక రకం. 135 రోజుల్లో కోతకు వస్తుంది. ఉల్లికోడును, అగ్గితెగులును తట్టుకుంటుంది. 2012లో పొలాస పరిశోధన స్థానం నుంచి విడుదల చేశారు.

ఏటా రెండెకరాల్లో సాగు..



ప్రతి ఏడాది వానాకాలంలో రెండెకరాల్లో సన్న రకం ధాన్యం పండిస్తా. నేనే రైస్‌మిల్లులో మర ఆడించి రైతులకు నేరుగా విక్రయిస్తా. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు చల్లకుండా సేంద్రియ ఎరువులతో పంటపండించి మంచి దిగుబడి సాధిస్తున్నా.

– ఎన్నం బాపురెడ్డి, జైనా, ధర్మపురి (మం)

మార్కెట్లో మంచి డిమాండ్



సన్నరకం బియ్యానికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. రైతులే స్వయంగా మిల్లింగ్ చేసి బియ్యం విక్రయించినా మంచి ధర లభిస్తుంది. సన్నరకం వరిలో మంచి దిగుబడినిచ్చే రకాలను ఎంపిక చేసుకోవాలి.

– డాక్టర్ లక్ష్మీప్రసన్న, శాస్త్రవేత్త, పొలాస

టేకు కలప స్వాధీనం



సారంగాపూర్: మండలంలోని బట్టపల్లి అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం టేకు చెట్లను నరికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా సర్పంచ్ అర్రె లక్ష్మీ ఆధ్వర్యంలో కలపను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అటవీశాఖకు సమాచారం ఇచ్చారు. అటవీ ప్రాంతంలో సదరు వ్యక్తులు విలువైన మూడు టేకు చెట్లను నరికి వాటిని తరలించేందుకు యత్నిస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నార

నివాళి



రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రవీందర్‌రెడ్డి

జగిత్యాల రూరల్: మండలంలోని పొలాస గ్రామానికి చెందిన పడాల రాజు భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేస్తేనే నక్సలైట్లు కాల్చివేశారని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముదుగంటి రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాజు సంస్మరణ సభను జగిత్యాల అర్బన్ మండలం పెర్కపల్లి శివారులోని భాగ్యరాజ్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. రాజు చిత్రపటం వద్ద రవీందర్‌రెడ్డి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జగిత్యాలలో జాతీయవాదం కోసం రామన్న, గోపన్న, జితన్న ప్రాణాలర్పించారని, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పడాల రాజు పోరాటం చేయడంతోనే 1988 జూన్ 23న నక్సలైట్లు కాల్చిచంపినట్లు గుర్తుచేశారు.

నేడు స్వగ్రామానికి వలసజీవి మృతదేహం



దుబాయిలో మృతిచెందిన యువకుడికి నివాళి అర్పిస్తున్న సత్యం, ప్రవాస తెలంగాణ వాసులు

- మృతదేహం రావడానికి సహకరించిన ఎన్నారై సత్యం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలకేంద్రానికి చెందిన శివయ్యగారి నవీన్(29) గత సోమవారం దుబాయిలో గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. నవీన్ చనిపోయిన విషయాన్ని సింగిల్‌విండో చైర్మన్ గుండారం కృష్ణారెడ్డి ఎన్నారై సత్యం దృష్టికి తీసుకెళ్లారు. త్వరగా మృతదేహాన్ని పంపించేలా సహకరించాలని కోరారు. స్పందించిన సత్యం దాదాపు రూ.2లక్షల వరకు సొంతంగా ఖర్చు పెట్టుకొని ఐదు రోజుల్లోనే మృతదేహం స్వగ్రామానికి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. నవీన్ మృతదేహం శనివారం ఎల్లారెడ్డిపేటకు చేరుకోనుంది. కాగా నవీన్‌కు గతేడాది వివాహమైంది. భార్యతో సహా దుబాయికి వెళ్లాడు. చిన్న వయస్సులోనే గుండెపోటుతో మృతిచెందడంపై స్థానికులు విషాదంలో ఉన్నారు. మృతుడికి తండ్రి నర్సయ్య, తల్లి నర్సవ్వ ఉన్నారు.

ఉప్పల శ్రీనివాస్‌కు 'యోగియోగ' అవార్డు



అవార్డు అందుకుంటున్న ఉప్పల శ్రీనివాస్

సిరిసిల్ల కల్చరల్: పట్టణానికి చెందిన ప్రముఖ యోగాచార్యుడు ఉప్పల శ్రీనివాస్‌కు తమిళనాడుకు చెందిన సంస్థ ప్రత్యేక అవార్డు అందజేసింది. దశాబ్దకాలంలో సుమారు 6 వేల మందికి యోగా సాధనలో శిక్షణనిస్తూ సేవలందిస్తున్నందున ×యోగి యోగా× బిరుదును బహూకరిస్తున్నట్లు ఆ సంస్థ తరఫున అవార్డు అందించిన జిల్లా న్యాయమూర్తి ఎస్ ప్రేమలత తెలిపారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేస్తూ విద్యార్థుల్లో యోగాపై ఆసక్తిని పెంచడంతో పాటు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ఆయా విద్యార్థులు రాణించేలా కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను ప్రేమలత అభినందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, ప్రతినిధులు ఎస్.అనిల్‌కుమార్, ఏజీపీ రవీందర్, జక్కని వెంకట్రాజం, గంగాధర్, అల్లాడి శ్రీనివాస్, యాద రమేశ్, బిల్ల శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రీదేవి, చంద్రకళ పాల్గొన్నారు.

విద్యారంగంపై నిర్లక్ష్యం

ముస్తాబాద్(సిరిసిల్ల): విద్యారంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్కెం నాగరాజు పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేవన్నారు. పాఠశాలలు పునర్ ప్రారంభమై మూడు వారాలు గడుస్తున్నా వసతులు కల్పించలేదన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులతో తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్న ప్రభుత్వం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తోందన్నారు. మోడల్‌స్కూల్స్, కస్తూర్బా, జెడ్పీ పాఠశాలల్లో కనీస వసతులు లేవన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.5,300 కోట్లు ఇప్పటికీ విడుదల చేయలేదన్నారు. విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. సమస్యల సాధన కోసం విద్యార్థులకు అండగా నిలుస్తుందన్నారు. అక్యారి మహేశ్, ప్రశాంత్, ప్రకాశ్, రాజు, ఫణి కిషోర్, శివకుమార్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్ల మోదీ పాలనలో దేశాభివృద్ధి



నర్సింగాపూర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్

చందుర్తి(వేములవాడ): మోదీ తొమ్మిదేళ్ల పాలనలోనే దేశం అభివృద్ధి చెందిందని, అన్నివర్గాల ప్రజలు మోదీ పాలనకు ఆకర్షితులయ్యారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేశ్ పేర్కొన్నారు. చందుర్తి మండలం జోగాపూర్‌లో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్ ఆధ్వర్యంలో గడపగడపకూ ప్రచారం చేపట్టారు. రమేశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు సీఎం కేసీఆర్ పేరిట ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మోసాలను ప్రజలు గుర్తించారని, కేంద్రంలో బీజేపీ తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను మళ్లీ పార్టీ గెలిపిస్తాయన్న ధీమా వ్యక్తం చేశారు. అయోధ్య పర్శరాములు, తుప్పటి పర్శరాములు, బిల్లా నరేశ్, పల్లి ప్రశాంత్, గడ్డం శ్రీకాంత్, మామిడి సురేశ్, వట్టెం రాజు, నాగం ఎల్లయ్య, మొగిలి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులో అగ్ని ప్రమాదం



రైస్‌మిల్‌లో చెలరేగిన మంటలు

ధర్మపురి : మండలంలోని ఓ రైస్‌మిల్లులో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని తిమ్మాపూర్ సమీపంలో కొంతకాలంగా శ్రీనివాస పారాబాయిల్డ్ రైస్ మిల్‌ను నిర్వహిస్తున్నారు. రోజూ మాదిరిగానే గురువారం రాత్రి ధాన్యాన్ని పైకి తీసుకెళ్లే క్రమంలో ఎలివేటర్‌లో మంటలు చెలరేగాయి. దీంతో కూలీలు అక్కడినుంచి ఉరుకులు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పారు. మొదట ధాన్యం పైకి తీసుకెళ్లే పైపులోపల మంటలు బయటకు కనిపించలేదు. పైనున్న ఎలివేటర్‌లో మంటలు కనిపించాయని దీంతో పైపులో ఉన్న వస్తువులన్నీ అప్పటికే కాలిపోయాయని యజమాని సాయిని శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.15 లక్షల విలువగల వస్తు సామగ్రి దగ్ధమైనట్లు ఆయన తెలిపారు.

యువకుడి ఆత్మహత్యా యత్నం

కోనరావుపేట: తన భూమిలో వేసిన బోరుపై ఇతరులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారని మనస్తాపానికి గురైన ఓ యువ రైతు ఆత్మహత్యా యత్నానికి యత్నించాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మర్తనపేట గ్రామానికి చెందిన గుర్రం చిన్న రాజిరెడ్డి కుమారుడు నవీన్ (30) గ్రామ శివారులోని తనకున్న నాలుగెరాల భూమిలో వారం రోజులక్రితం బోరువేశాడు. ఇదే గ్రామానికి చెందిన భూయజమానులు శ్రీనివాసరావు, రఘుపతిరావు తమ బోరుకు దగ్గరగా బోరు వేసి వాల్టా చట్టాన్ని ఉల్లంఘించారంటూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం నవీన్ బోర్ మోటార్‌ను దించేందుకు రాగా విచారణకు వచ్చిన ఆర్ఐ మోటార్ వైరును కట్‌చేశారు. దీంతో మనస్తాపానికి గురైన నవీన్ అక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి యత్నించాడు. చికిత్స నిమిత్తం సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మామిడిపల్లి మూలవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. గ్రామ శివారులోని మూలవాగులో ఇసుకను తరలించుటకు ప్రయత్నిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్లు జవ్వాజి శ్రీనివాస్, జవ్వాజి అజయ్, యజమానులు జంకె మధు, జవ్వాజి నారాయణపై కేసునమోదు చేశామన్నారు.

ట్రాక్టర్, జేసీబీ యజమానులపై కేసు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం నర్మాల శివారులో అక్రమంగా ఇసుక తవ్వుతూ, రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. నర్మాల శివారులో జేసీబీ, రెండు ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా పట్టుకొని వాహనాల యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో బీర్‌పూర్ ఎంపీడీవో మృతి



మల్లారెడ్డి (ఫైల్)



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్: బీర్‌పూర్ ఎంపీడీవో కరివేద మల్లారెడ్డి (58) అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మల్లారెడ్డిది చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామం కాగా ప్రస్తుతం కరీంనగర్‌లో నివాసముంటున్నారు. శుక్రవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురైన మల్లారెడ్డిని ఆయన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతిచెందారు. మృతుడికి భార్య సుకన్య, ఇద్దరు కుమారులున్నారు. ప్రస్తుతం ఓ కుమారుడు అమెరికాలో ఉంటుండగా సమాచారం అందించడంతో అక్కడినుంచి బయలుదేరాడని, అంత్యక్రియలు ఆదివారం జరగనున్నాయని మండల అధికారులు పేర్కొన్నారు. మల్లారెడ్డి మూడేళ్లుగా ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మృతివార్త తెలియగానే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జెడ్పీ సీఈవో రామానుజాచార్యులు, ఎంపీపీ మసర్తి రమేశ్, ఎంపీవో వెంకటకృష్ణరాజు, సూపరింటెండెంట్ రాజమౌళి, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, ఎంపీటీసీ సభ్యులు రంగు లక్ష్మణ్, ఆడెపు మల్లీశ్వరి, సర్పంచులు నల్ల మహిపాల్‌రెడ్డి, పర్వతం రవి, చుంచు శారద, రిక్కల ప్రభాకర్, మేసు ఏసు, బందెల మరియ, చిత్రం సుగుణ, సీపతి రమేశ్, బద్ది భీమక్క, బోడ స్వప్న, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మత ప్రచారాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లెలో ఓ మతానికి చెందినవారు మతానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేస్తుండగా గ్రామానికి చెందిన యువకులతో పాటు, మండలంలోని బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. గ్రామంలో ఓ మతానికి చెందిన దాదాపు 50 మంది వరకు గ్రామంలో ర్యాలీగా తమ మతంలో చేరాలని ప్రచారం నిర్వహిస్తూ ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామంలో ఇంటింటా తిరిగి ప్రచారం చేయడం సరికాదని బీజేపీ నాయకులు దీనిని అడ్డుకున్నారు. దీంతో సదరు మత ప్రచారకులు, బీజేపీ నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. బీజేపీ నా యకులు ఒకరిపై దాడి చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని ఇద్దరికి సర్దిచెప్పడంతో పాటు మత ప్రచారకులను పంపించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

దాడి ఘటనలో ముగ్గురి రిమాండ్

ధర్మపురి : పాత కక్షలను మనుసులో పెట్టుకొని కత్తితో దాడిచేసిన సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దత్తాత్రి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణానికి చెందిన ముప్పట్ల నిరంజన్, బత్తిని వినయ్‌కు ఇదే పట్టణానికి చెందిన గుర్రాల గణేశ్, కోట రాజన్న, మేకల గంగాధర్‌కు పాత కక్షలున్నాయి. ఈనెల 10న ముప్పట్ల నిరంజన్, బత్తిని వినయ్ సంతలో చిట్టి వసూలు చేస్తుండగా గుర్రాల గణేశ్, కోట రాజన్న, మేకల గంగాధర్ కత్తితో దాడిచేశారు. దీంతో నిరంజన్, వినయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై నిరంజన్ సోదరుడు ముప్పట్ల గంగాధర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అప్పటినుంచి వారు తప్పించుకొని తిరుగుతుండగా శుక్రవారం ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.



కన్నులపండువగా జగన్నాథస్వామి కల్యాణం

సారంగాపూర్(జగిత్యాల): రేచపల్లి గ్రామంలోని నీలాద్రి కొండపై వెలిసిన శ్రీ భూదేవి నీలాదేవి సమేత జగన్నాథస్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం కన్నులపండువగా నిర్వహించారు. జగన్నాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎద్మల జయ, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాజేశం, ఎంపీటీసీ లావణ్య, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదలకు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న ఐక్య పోరాట వేదిక నాయకులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద గుడిసెలు వేసుకున్న వారికి 125 గజాల ఇంటి స్థలం ఇచ్చి పట్టాలివ్వాలని తెలంగాణ ప్రజాసంఘాల ఐక్య పోరాట వేదిక నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇళ్ల స్థలాలు, డబుల్‌బెడ్‌రూంల సాదన కోసం జూన్ 18 నుంచి 27 వరకు బస్సు యాత్ర చేపడుతున్నామని, విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ వీరయ్య పాల్గొన్నారు.

దుకాణాల్లో మున్సిపల్ అధికారుల తనిఖీ



తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల: పట్టణంలోని కిరాణ దుకాణాలు, ప్లాస్టిక్ ఏజెన్సీలు, ఇతర షాపుల్లో మున్సిపల్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ బ్యాగులను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. బట్ట సంచులు వినియోగించాలని సూచించారు. అదే విధంగా రోడ్లపై చెత్త వేయకూడదని, దుకాణాల ముందట చెత్త డబ్బాలు ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న వ్యాపారులకు జరిమానా



కవర్లను స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

మెట్‌పల్లి: పట్టణంలో కొత్త బస్టాండ్ ప్రాంతంలో తోపుడు బండ్లు, బేకరీలు, కిరాణా దుకాణాల్లో శుక్రవారం మున్సిపల్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేదిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న తోపుడు బండ్లు, విక్రయిస్తున్న కిరాణా వ్యాపారులకు రూ.6 వేల జరిమానా విధించారు. కవర్లకు బదులుగా ప్రత్యామ్నాయంగా ఇతర సంచులను వినియోగించాలని వ్యాపారులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ విష్ణుముజీబ్, పున్నం నాయక్ ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే

జగిత్యాల క్రైమ్: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం తప్పదని పట్టణ సీఐ నటేశ్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఇటీవల వివిధ ప్రాంతాల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 26 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరగడంతో పాటు, కొంత మంది అమాయకులైన వారి ప్రాణాలు పోతున్నాయన్నారు. వాహనదారులు తమ వాహనాలకు ఇన్సురెన్స్‌తో పాటు, డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనాన్ని రోడ్డుపైకి తీసుకురావాలన్నారు. వీరందిరిని కోర్టులో ప్రవేశపెట్టగా వీరికి రూ. 26 వేల జరిమాన న్యాయమూర్తి విధించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఆర్యవైశ్య అఫీషియల్ ప్రొఫెషనల్ (అవోప) జగిత్యాల జిల్లా మహిళ అధ్యక్షురాలు అనిత–మోటూరి శ్రీనివాస్ ఉపాధ్యాయ దంపతులు రూ.10 వేల విలువ గల పెన్నులు, నోట్‌బుక్‌లు ఎంఈవో గాయత్రి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అర్బన్ ఇన్‌చార్జి ఎంపీపీ ములాసపు లక్ష్మి, సర్పంచ్ రౌతు జయ, హెచ్‌ఎం సరంజామ, సునీల్‌రావు, శేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కథలాపూర్: మండలం అంబారిపేట గ్రామ శివారులోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతులు చేస్తున్నందున విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ భూమేశ్వర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంబారిపేట, తాండ్రాయ్యల, గంభీర్‌పూర్, తుర్తి, కలిగోట, పోతారం, ఇప్పపెల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తామన్నారు.



విత్తనాలు వేస్తున్న మహిళలు



నారుమడి కోసం దున్నుతున్న రైతు

సాగు పనులు షురూ..

కథలాపూర్/ ఇబ్రహీంపట్నం: జూన్ నెల వచ్చిందంటే చాలు రైతులు వానకాలం సాగు పనుల్లో బిజీగా ఉండేవారు. కానీ ఈసారి జూన్ నెలలో మూడు వారాలు గడిచిన వర్షాలు కురువక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కథలాపూర్, మేడిపెల్లి మండలాల్లో ఎక్కువగా బోరు బావులపై ఆధారపడి పంటలు పండిస్తారు. రెండు మండలాల రైతులు వరి, మొక్కజొన్న, పసుపు, పప్పు దినుసులు, మిర్చి పంటలు సాగు చేస్తుంటారు. వర్షాలు లేక సాగు ఏలా అని రైతులు వాపోతున్నారు. ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేసే అలవాటులో ఉన్న రైతు.. వరుణుడు కరుణించకపోతాడా అని ఎప్పటిలాగే దుక్కులు దున్నడం, వరినార్లు పోసేందుకు మడులు సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది పంటలసాగు నెల ఆలస్యమైందని మరికొందరు రైతులు దిగులు చెందుతున్నారు.

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే లక్ష్యం



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహారావు

కథలాపూర్: ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతోనే గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. శుక్రవారం కథలాపూర్ మండలం సిరికొండలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 800 మందికి వైద్య పరీక్షలు చేసి, 240 మందికి మెరుగైన వైద్యం అవసరమని గుర్తించి వారిని కరీంనగర్‌లోని మెడికల్ కళాశాలకు తీసుకెళ్లి ఉచిత వైద్యం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు కార్పొరేట్‌స్థాయి వైద్యం ఖరీదు కావడంతో చికిత్సల కోసం వెళ్లలేక సతమతమవుతున్నారన్నారు. పేద ప్రజల పరిస్థితిని ఆలోచించి తాము మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో వైద్యం అందిస్తున్నామన్నారు. పేద ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తే కొందరు రాజకీయ కోణంలో విమర్శలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గాండ్ల వీణ, ఎంపీటీసీ దొప్పల హైమావతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగప్రసాద్, ఏజీబీ మహేందర్, ముంజ దశాగౌడ్, ఎం.డీ ముజీబ్, రామాంజనేయులు, దీవి రాజు, ప్రభురాజు కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సహకారంతోనే ఉమ్మడి జిల్లాలో అగ్రస్థానం



బ్యాంక్ మేనేజర్‌ను సన్మానిస్తున్న చైర్మన్ సభ్యులు

సారంగాపూర్: రైతుల సహకారంతో బీర్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉమ్మడి జిల్లాలో అగ్ర స్థానంలో నిలిచిందని ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, కేడీసీసీ బ్యాంక్ ధర్మపురి శాఖ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో రైతులు, సంఘ డైరెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వరుసగా 11 ఏళ్లుగా వందశాతం వసూళ్లలో మొదటిస్థానంలో నిలవడం గొప్ప విషయమన్నారు.సంఘం పరిధిలో త్వరలో రైస్‌మిల్లును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సంఘం నుంచి కామన్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించాలని, బంగారంపై ప్రతి గ్రాముకు రూ. 4వేలు రుణం అందించాలని తీర్మానించారు. కార్యక్రమంలో విండో సీఈవో అయ్యోరి తిరుపతి, ఉపాధ్యక్షుడు వూరడి కొంరెల్లి, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకుసాగితే విజయం మీదే



చిన్నారికి దుస్తులు అందిస్తున్న నాయకులు

మల్లాపూర్: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే లక్ష్యం నిర్ణయించుకుని ముందుకు సాగితే విజయం తమ సొంతమవుతుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని వేంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉచితంగా నోట్‌బుక్స్, షూ, బ్యాగుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచే కష్టపడేతత్వాన్ని అలవర్చుకుని ఒక గొప్ప లక్ష్యం వైపు అడుగులు వేస్తే తాను చదివిన పాఠశాలకు, కన్న తల్లిదండ్రులకు, పుట్టిన ఊరితో పాటు దేశానికి గర్వకారణంగా నిలిచిపోవచ్చన్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, షూ, స్కూల్ బ్యాగులు పంపిణి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, సర్పంచ్ బిట్ల సరోజన, ఎంపీటీసీ గుగ్లావత్ భూమి, ఉపసర్పంచ్ వేల్మల రాజనర్సయ్య, ఎస్ఎంసీ చైర్మన్ హెచ్‌ఎం జక్కుల నవీన్‌కుమార్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి నిరుపేదలకు వరం

కోరుట్లరూరల్: నిరుపేదలకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు వరమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను కౌన్సిలర్లు, నాయకులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, గ్రుడ్ల మనోహర్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాల వద్ద ఏబీవీపీ ధర్నా



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కోరుట్ల: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా డీఈవో, ఎంఈవోలు పట్టించుకోవటం లేదన్నారు. పట్టణంలో ఎన్నో పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నా విద్యాధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి మాడవేణి సునీల్, జోనల్ ఇన్‌చార్జి పవన్, వైస్ ప్రెసిడెంట్ సంజీవ్, ప్రణయ్, అభి, వినయ్, పవన్, సూరజ్, సా యి, ప్రసాద్, కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను సీజ్ చేయాలి

జగిత్యాల: పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలలను వెంటనే సీజ్ చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పలు ప్రైవేటు పాఠశాలల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుస్తకాలను అమ్ముతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, డీఈవో పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చర్యలు తీసుకోకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మనోహర్, విష్ణు, గణేశ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం కోసం 1116 దరఖాస్తులు

రాయికల్: బీసీ కులస్తులకు ప్రభుత్వం ఆర్థిక సాయం కోసం రాయికల్ పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా 1116 దరఖాస్తులు వచ్చినట్లు కమిషనర్, ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ తెలిపారు. రాయికల్ మున్సిపాలిటీలో 349, మండలంలో 767 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు.

వీధివ్యాపారులకు గొడుగుల పంపిణీ

రాయికల్: పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో వీధి వ్యాపారులకు లయన్స్ క్లబ్ సభ్యులు శుక్రవారం గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, డీసీలు బత్తిని భూమయ్య, మ్యాకల రమేశ్, అధ్యక్షుడు ఎద్దండి దివాకర్, రంజిత్, కడకుంట్ల నరేశ్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

కథలాపూర్: మండలకేంద్రానికి చెందిన శనిగారం శశిధర్ అనే విద్యార్థి నవోదయ విద్యాలయంలో సీటు సాధించినట్లు మన స్కూల్ కరస్పాండెంట్ మిట్టపెల్లి కిషన్ శుక్రవారం తెలిపారు. చొప్పదండిలోని నవోదయ విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచి సీటు సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థి శశిధర్‌ను పలువురు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లెనిన్‌బాబు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

ఆకతాయిల చేష్టలకు పచ్చని చెట్లు దగ్ధం

మల్యాల: మండల కేంద్రం నుంచి రాజారం వెళ్లే బైపాస్ రోడ్డులో నూకపల్లి శివారులోని రోడ్డుకిరువైపులా ఉన్న పచ్చని చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. అటవీశాఖ ఆధ్వర్యంలో రోడ్డు పక్కన నాటిన మొక్కలు ఆకతాయిల చేష్టలకు అగ్నికి ఆహుతయ్యాయని స్థానికులు తెలిపారు. మొక్కలను రక్షించాల్సిన అటవీశాఖ అధికారులుసైతం పరిసరాలను పరిశీలించడం లేదని, రోడ్డు పక్కన చెట్లు కాలిపోయినా పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటా బీజేపీ ప్రచారం

ఇబ్రహీంపట్నం: మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నరేంద్ర మోడీ 9 ఏళ్ల సుపారిపాలనలో చేపట్టిన అభివృద్ధిపై శుక్రవారం ఇబ్రహీంపట్నంలో 23, 24 బూత్‌లలో గడపగడపకు వెళ్లి బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు పంచుతూ ప్రజలకు తెలిపారు.కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు జకరయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు తీగల శ్రీధర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సుంచు రణధీర్, ఉపాధ్యక్షులు ఉడుత రాజు, వెంకటేశ్‌యాదవ్, బూత్ అధ్యక్షుడు పుప్పెం మహేందర్, పసునూరి మారుతి పాల్గొన్నారు.

ఘనంగా మహలక్ష్మీ అమ్మవారికి పూజలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో శుక్రవారం ఘనంగా మహాలక్ష్మీ అమ్మవారికి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగపుత్రుల గొల్లలతో నైవేద్యాలను డప్పు చప్పుళ్లతో ప్రధాన వీధులగుండా పోతరాజుల విన్యాసాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామశివారులోని మహాలక్ష్మి ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నాగేశ్, ఉపాధ్యక్షుడు పెద్ద రాజం, సింగిల్ విండో చైర్మన్ అంకతి రాజన్న, ఉపసర్పంచ్ అసతి పెద్ద రాజం, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మడేలేశ్వర స్వామి బోనాలు



బోనం ఎత్తుకున్న మాజీ ఎమ్మెల్యే శోభ

కొండగట్టు: కొడిమ్యాల మండలం నాచుపెల్లిలో రజక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శ్రీమడేలేశ్వర స్వామి బోనాల పండుగ కార్యక్రమానికి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బోడిగె శోభ, చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మేడిపెల్లి సత్యం హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలువేరి నారాయణ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ముత్యం శంకర్, మండల అధ్యక్షుడు గాజుల అజయ్‌గౌడ్, తాళ్ళపెల్లి అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితే గానీ పట్టించుకోరా?



బైపాస్ ప్రధాన రోడ్డుపై స్కూల్ ముందు నిలిచిన వాహనాలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ సమీపంలో పార్కింగ్ లేకపోవడంతో రోడ్డు పైనే వాహనాలు నిలుపుతున్నారు. అటు వాహనదారులకు ఇబ్బందులు పడటంతో పాటు, అదే సమయంలో విద్యార్థులకు ఏదైనా జరిగితే ఇబ్బందులు పడాల్సిందే. స్కూల్ అనుమతులు ఇచ్చే విషయంలో అధికారులు పార్కింగ్ ఉన్నాయా, ఫైర్ సేఫ్టీ ఉన్నాయా చూడకుండానే అనుమతులు ఇవ్వడం, చిన్నచిన్న భవనాల్లో పాఠశాలలను ఏర్పాటు చేయడంతో ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్థిక సాయానికి 795 దరఖాస్తులు



పత్రాల కోసం వేచి ఉన్న లబ్ధిదారులు (ఫైల్)

పెగడపల్లి: వెనుకబడిన కులాల చేతి వృత్తిదారులకు ప్రభుత్వం ప్రకటించిన లక్ష రూపాయల ఆర్థిక సాయం దరఖాస్తు గడువు ఈనెల 20తో ముగిసింది. ప్రభుత్వం నిర్ణయించిన 15 రోజుల వ్యవధిలో పెగడపల్లిలో మండలంలో 23 గ్రామ పంచాయతీల పరిధిలో 795 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో మహిళలు 300 మంది, పురుషులు 495 మంది దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సర్వర్ బిజీ ఉండటంతో సమయానికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యంతో చాలామంది దరఖాస్తు చేసుకోలేక పోయారు. దరఖాస్తు చేసుకునే వారు ఇంకా గడువు పెంచుతారని ఆశలు పెట్టుకోగా ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లచల్లింది. బీసీ సంక్షేమ శాఖ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 30 వరకు దరఖాస్తుల పరిశీలన చేయనున్నారు. పరిశీలన పూర్తయితే అర్హుల సంఖ్య తేలనుంది. కలెక్టర్ చైర్మన్‌గా, ఎంపీడీవో, డీఆర్డీవో, సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణలో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. తుది జాబితాను బీసీ సంక్షేమశాఖకు పంపించి లబ్ధిదారులకు రూ. లక్ష చెక్కును అందజేస్తారు. చెక్కు అందుకున్న నెల రోజుల్లో లబ్ధిదారులు ఎంచుకున్న పరికరాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మండలంలో కులాల వారిగా వచ్చిన దరఖాస్తులు బీసీ-ఏ 485, బీసీ-బీ 278, బీసీ-డీ 32 చొప్పున మొత్తం దరఖాస్తులు వచ్చినట్లు, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని, దళారులను ఆశ్రయించవద్దని ఎంపీడీవో పుల్లయ్య పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల దశ దిశ మార్చడానికి కృషి



మాట్లాడుతున్న డాక్టర్ వికాశ్

కథలాపూర్: ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి గ్రామీణ ప్రాంతాల దశ దిశను మార్చడానికి కృషి చేస్తామని ప్రతిమ ఆస్పత్రి వైద్యులు చెన్నమనేని వికాశ్, చెన్నమనేని దీప అన్నారు. శుక్రవారం భీమారం మండలం కమ్మరిపేటలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్‌ప్లాంట్ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు కుల మతాలకు అతీతంగా ఐకమత్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. బ్యాంకులు రైతులను ఇబ్బందిపెట్టకుండా రుణాలు మంజూరు చేయాలన్నారు. రుణమాఫీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ప్రతీ మండలంలో నైపుణ్య అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. యువతకు చేయుతనిస్తే నవభారత నిర్మాణానికి తోడ్పడుతారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిట్టల లక్ష్మి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ క్యాతం దశరథంరెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు ముంజ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మెన్నేని తిరుమల్‌రావు, మకిలీ ఇబ్రాయిల్, గాంధారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సామాజిక సేవే లయన్స్‌క్లబ్ ధ్యేయం

రాయికల్: సామాజిక సేవ చేయడమే లయన్స్‌క్లబ్ ధ్యేయమని లయన్స్‌క్లబ్ వైస్ గవర్నర్ సింహరాజు కోదండరాములు అన్నారు. రాయికల్ పట్టణంలోని వీఎస్ గార్డెన్స్‌లో లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. అధ్యక్షుడిగా కొమ్ముల ఆదిరెడ్డి, సెక్రటరీగా మోసారపు శ్రీకాంత్, ట్రెజరీగా గంట్యాల ప్రవీణ్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ సామాజిక సేవ కార్యక్రమాల్లో ముందుదని, మరిన్ని సేవ కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, ఎల్‌సీఐఎఫ్ కో–ఆర్డినేటర్ చంద్రప్రకాశ్, చాప కిశోర్, జోన్ చైర్‌పర్సన్లు రమాకాంత్, కాటిపల్లి రాంరెడ్డి, డీసీలు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు

మెట్‌పల్లి: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు దివంగత శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను పట్టణంలో శుక్రవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ హిందుత్వ ఉద్యమ నేతగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్, దొనికెల నవీన్, కొండ్లెపు శ్రీనివాస్, బొడ్ల ఆనంద్ తదితరులున్నారు.

ధర్మపురి: పట్టణంలో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు బెజ్జారపు లవన్‌కుమార్, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, నాయకులు ఓరుగంటి చంద్రశేఖర్, ఆకుల శ్రీనివాస్, స్తంభంకాడి శ్యామ్, తిరుమందాస్ సత్యనారాయణ, కాశెట్టి అనిల్ ఉన్నారు.

సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ

కోరుట్ల: పట్టణంలో నూతనంగా నిర్మించే గాండ్ల తిలకేశ్వర సంఘ భవన నిర్మాణానికి పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అన్నం అనిల్ శుక్రవారం భూమిపూజ చేశారు. భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సీడీపీ నిధులు మంజూరు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మూర్తాడ్ లక్ష్మీ నారాయణ, జిందం లక్ష్మీ నారాయణ, సంఘ అధ్యక్షుడు కనకయ్య, నాయకులు ఆడెపు మధు , బలిజ రాజరెడ్డి, సనావుద్దీన్, ప్రభు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు మృతికి టీజీవో యూనియన్ సంతాపం

రాయికల్: బీర్‌పూర్ ఎంపీడీవో మల్లారెడ్డి ఆకస్మిక మృతి పట్ల శుక్రవారం తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపినట్లు టీజీవో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గంగుల సంతోష్‌కుమార్ తెలిపారు. ఆయన వెంట నాయకులు రవిబాబు, నవీన్, ప్రభు, శ్రీనివాస్, మహేందర్, ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల జోష్



విద్యార్థుల నృత్యాలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మానస ఎక్సలెన్స్ స్కూల్‌లో ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రజితరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.